# వేలం పాట

## కర్లపాలెం హనుమంతరావు

"యువర్ అటెన్షన్ ప్లీజ్!...!"

జబర్దస్తీగా వినిపించిన ఆ గొంతుతో అప్పటిదాకా రకరకాల కబుర్లతో గందరగోళంగావున్న సెకండ్ క్లాస్ కంపార్ట్ మెంట్ కొద్దిగా సద్దుమణిగింది.

"లేడీస్ అండ్ జెంటిల్ మెన్!... భాయియోం... ఔర్ బహెనోం... అయ్యలారా... అమ్మలారా!..."

మూడు భాషల్లోనూ ముచ్చటగా సంబోధిస్తున్న ఆ మూడు పదులునిండని యువకుడు చూపులకు కూడా చాలా ముచ్చటగా వున్నాడు.

అప్పుడే ఐరన్ చేసి వేసుకొన్న ట్విన్ కాస్ట్ లీ డ్రెస్, చెదరని హిప్పీ క్రాపు, చెరగని చిరునవ్వుతో చదువుకుపోతున్న ఆ కుర్రవాడి పాఠాన్ని ఎంత వద్దనుకున్నా వినకుండా వుండలేక పోయాను.

"...ఇది మా కంపెనీ ప్రచారం కోసం, సేల్స్ ప్రమోషన్ కోసం పెట్టిన పథకం... ఇక్కడవున్న ఈ డ్రెస్ మెటీరియల్ లో ఒక్కో ఐటమ్ ను పాటకు పెడతాము ... టెరీకాట్, పాలిస్టర్, స్ట్రెచ్ లాన్, వూలెన్... జపాన్, అమెరికా, స్విట్జర్లాండ్ మోడల్స్... పాంటు పీసులు, షర్టుపీసులు, సూట్ మెటీరియల్. మీటరు, మీటరున్నర... టూ మీటర్స్ అండ్ టూ అండ్ హాఫ్ మీటర్స్... ఇప్పుడు ఆక్షన్ లో పాడుకొన్న అదృష్టవంతులకు దక్కుతాయి... ఇందులో మోసం, దగా, మాయ, మిస్టరీ— ఏవీ లేవుసార్!... కంపెనీ ప్రచారం కోసం చేపట్టిన సేల్స్ ప్రమోషన్ పథకం మాత్రమే. అతితక్కువధరలో అతిమన్నికైన బట్టలను వేలం పాటలో పాడుకోవచ్చు... గెల్చుకోవచ్చు... ఇందులో బలవంతం ఏమీ లేదు మోసం అసలే వుండదు ఆక్షన్ లో ఎవరైనా పాల్గొనవచ్చు... ఐతే, రెడీకాష్ వుండాలి... పాడినవారందరికీ కంపెనీ తరఫున ఏదో ఒక బహుమతి గిట్టుతుంది... బాల్ పెన్. దువ్వెన... సెంట్ బాటిల్... కంపెనీ కాంప్లిమెంటరీగా... పాటలో పాల్గొన్న వాళ్ళందరికీ వుచితంగా ఇస్తుంది..."

వుచితం అనేమాట వినేసరికి చాలా మంది దృష్టిఇటు మళ్ళింది.

అనుమానంపోని ఓ నడివయసు రైతు "గుడ్డలు మంచివేనా?" అనడిగాడు.

"మంచి ప్రశ్న వేశారు బాబాయ్ గారూ! మంచి రకం బట్టలను ఇలా వూరూరూ తిప్పుకుంటూ అమ్ముకోవాల్సిన అవసరం



ఏమిటుంది అని మీలో చాలా మందికి అనుమానంగా వుండొచ్చు... లేడీస్, జంటిల్‌మన్!... ఇది లిపారియా మిల్స్‌వారి తయారీసరుకు... కేవలం ప్రచారం కోసం కమీషన్ పద్ధతిమీద మేము ఇలా అమ్ముతుంటాం... అంతేగాని బట్టనాసి రకం అయికాదు... ఒక్కసారి మీరే మీ కళ్ళతో చూడండి ... కంపెనీ లేబిల్స్... బజారులో దొరికేరేటు..." అంటూ ఆ వేలంపాట కుర్రవాడు లైట్ బ్లూ షర్టుపీస్ మడత విప్పి ప్రశ్న అడిగిన రైతు వళ్ళో పడేశాడు.

పక్కనున్న జనం దాన్ని పరీక్షించటం మొదలు పెట్టారు. కుర్రవాడు వేలంపాట మొదలు పెట్టాడు.

"తాతగారి వళ్ళోవున్న ఈ లైట్ బ్లూ టెరీకాటన్ షర్ట్‌పీస్... టూమీటర్స్... కంపెనీ వారిపాట... పదిహేను రూపాయలు. ఫిఫ్టీన్ రూపీస్ ఓన్లీ..."

ఎటువైపునుండీ బదులు లేదు.

"ఇదే బట్ట బజారులో మీటరు పాతిక రూపాయలు తక్కువ వుండదు సార్... అదృష్టవంతులు పాడుకోండి... పాటలో పాల్గొన్న వారందరికీ ఒక దువ్వెన వుచితం..."

"పదహారు రూపాయలు" అన్నాడు కిటికీ పక్క సీటులో కూర్చున్న బట్టతల పల్లెటూరి మనిషి.

"పదహారు రూపాయలు... అమెరికన్ మోడల్ టెరీకాటన్ షర్ట్‌పీస్... టూమీటర్స్... ఫర్ సిక్స్‌టీన్ రూపీస్ ఓన్లీ..."

"ఒకటోసారి...16 రూపాయలు... రెండోసారి..." బదులు లేదు.

"పదహారు రూపాయల పాట గిట్టనిగనక కొట్టివేసుకుంటున్నాం... కంపెనీ తరుఫున తాతగారికి రూపాయి ఖరీదుచేసే దువ్వెన ఇస్తున్నాం ఫ్రీగా..."


బట్టతల పెద్దమనిషి చేతికి వుచితంగానే దువ్వెన వచ్చేసరికి చాలామందికి హుషారు పెరిగినట్లుంది... "టెరీన్ బిట్ జపాన్ మోడల్ టూఅండ్‌హాఫ్ మీటర్స్" అంటూ వేలంపాట కుర్రవాడు బైటకు తీసిన గులాబిరంగు గుడ్డను ఈసారి మరెంత మంది ఎక్కువశ్రద్ధగా పరిశీలించటంలో మునిగిపోయారు.

"కంపెనీ వారిపాట పాతిక రూపాయలు... ఫ్రీ మార్కెట్‌లో దానిరేట్ మినిమమ్ ఫార్టీరూపీస్ పర్‌మీటర్... అదృష్టవంతులు తొందర పడండి... కంపెనీపాట ట్వెన్‌టీఫైవ్‌రూపీస్..పాడిన వారందరికి తలావక బాల్ పెన్ కాంప్లిమెంటరీ...!"

పాట పదినిముషాలసు అతికష్టంమీద ముప్పై రూపాయలకొచ్చింది.

"థర్టీరూపీస్... ఒకటోసారి...థర్టీ రూపీస్ రెండోసారి..." వేలంపాట కుర్రాడు గొంతు చించుకొంటునే వున్నాడు.

"మేష్టారూ!. ఈ రకం వ్యాపారంలో మాయ ఏమీ లేదంటారా?" అని ఆడగాడు అప్పటిదాకా ఇండియన్ ఎక్స్‌ప్రెస్ తెరిచి పెట్టుకున్న నాపక్క పాసింజరు. అతను సూటూ బూటూలో చూపులకే చాలా దర్జాగా వున్నాడు. అంతమంది మధ్యలో నన్నే అడగటంతో కొంచెం




గర్వం అవిపించింది "ఏదో మోసం లేకుండా వుండదనుకొంటానండీ... ఏ మాయాలేకపోతే ఇంతింత ఖరీదైన బట్టలు ఇంత చవగ్గా అమ్మేస్తే ఎలాగిడుతుంది? కంపెనీ ప్రచారం అనేది వట్టి ఫార్స్... అసలు క్లాత్ నాసిరకమై వుండొచ్చు" అన్నాను.

"నో... బట్టమాత్రం మంచిదే... ముట్టుకుంటే తెలీటంలా...! ఇది మరీ నాసిరకంకాదు. మాది చీరాలలో హోల్ సేల్ క్లాత్ బిజినెస్ లెండి... బట్టల సంగతి నాకు బాగా తెలుసుగా... పోనీ పార్టీ వరకు నేను ట్రైచేసి చూస్తా... వస్తే అదృష్టవంతుణ్ణే. లేకపోతే బాల్ పెన్‌ఫ్రీ..." అని నవ్వాడు.

ఆ దఫాపాట పార్టీరు పీస్‌కి నాపక్కనున్న సూట్‌వాలాకు దక్కింది. పాటలో పాల్గొన్న ముసలాయనకు, మరో ఆడ మనిషికి బాల్‌పెన్‌లు ఫ్రీగా ఇచ్చి, పార్టీరుపీస్‌కి సూట్‌వాలాకు క్లాత్‌బిట్ ఇచ్చేసాడు వేలంపాట కుర్రాడు.

పాసింజరు బండి జాంద్రపేట ఒక్క నిమషం ఆగటానికి బాగా స్లో అవుతుండగా వేలంపాట కుర్రవాడు తన సామాను సర్దుకోసాగాడు.

"నీకీ వ్యాపారంలో ఏంగిడుతుందోయ్?" అని అడిగాను.

"గిట్టటం కాదండీ... చెప్పానుగా ఇది కమీషన్ వ్యాపారం. లిపారియా మిల్స్‌వాళ్ళకి ఏజెంటుగా ఇలా వూరూరా తిరుగుతూ సేల్స్ ప్రమోట్ చేస్తుంటాం..."

"కమీషనెంత?"

"ట్వెంటీ నుండి ట్వెంటీఫైవ్ పర్సెంట్ దాకా ఇస్తారండీ సేల్స్‌మీద"

"బాగా గిడుతుందా?"

"జనరల్‌గా బాగానే వుంటుందండీ.. ఒక్కోసారి... ఇదిగో ఇలా డల్‌గా ఏడుస్తుందిగాని..." అని సరుకును ఎత్తుకోబోతున్న వేలంపాట కుర్రవాడిని నా ఎదురుగా కూర్చున్న ఆడమనిషి ఆపింది "ఆ పాలిష్టర్ బట్ట పాటకు పెట్టబ్బాయ్... మా పింగాడికి ఎంతో కాలం నుండి తీసుకుందామనుకుంటున్నా" అని మొదలు పెట్టింది.

అప్పటికే ఆవిడగారు వుచితంగా బాల్ పెన్, దువ్వెన సంపాదించారు. ఐనా మరోటి సంపాదించుకోవాలన్న ఆట కోరిక అనిపించింది నాకు ఆవిడ వాలకం చూస్తూంటే. వేలం కుర్రవాడు పాలిష్టర్ బట్ట పైటికి తీసాడు. చేత్తోముట్టుకుని చూశాను. బాగానే వుందనిపించింది. సూట్‌వాలా కూడా చూసి ఫర వాలేదన్నాడు.

పాట పాతికదగ్గర ఆరంభమై పది సెకన్లలో నలభై దగ్గరికొచ్చిందీ సారి. సూట్‌వాలా, ఆడమనిషి, బాబాయిగారు, పాడేస్తున్నారు ఒకళ్ళమీద ఒకళ్ళు పోటీగా. ప్రయాణీకులందరికి పసందైన వినోదం!

నాకూ హుషారొచ్చింది ... నేనూ ఒక అంకె చెబితే పుట్టిమునిగేదేముంది? వస్తేవస్తుంది... పోతే సెంట్‌బాటిల్ అప్పా దక్కుతుంది... రూపాయిఖరీదు చేసే గిఫ్ట్! 'నలభై ఐదు' అంటున్న ఆడమనిషికి పోటీగా 'యాభై' అని ఓగ్గరగా అరిచాను.

అప్పటిదాకా నిశ్శబ్దంగా వుండి అంత పెద్దగా అరిచిన నావంక కంపార్ట్‌మెంటులో అంతా వింతగా చూశారు. నా ఎదుర బెంచీలో కూర్చున్న ఆ కాలేజీ పిల్లయితే మరీ ఆసక్తిగా చూస్తోంది నావంక.

'యాభైయ్యేదు' అంది ఆడమనిషి నావైపు ఈసడింపుగా చూస్తూ.

కాలేజీ పిల్లముందు తలవొంపులు... ఎంత సిగ్గుచేటు! పక్కనేవున్న సూట్‌వాలా ప్రోత్సాహంతో మరో అయిదు రూపాయలు పాట పెంచాను.

వేలంపాట కుర్రవాడు హుషారుగా అరుస్తున్నాడు.

"అరవై రూపాయలు...ఒకటోసారి రెండోసారి..." బండి వేటపాలెం స్టేషనులో ఆగింది.


"...మూడోసారి ..." అని బట్ట మడతపెట్టి నా వళ్ళో పడేశాడు వేలంపాట కుర్రవాడు.

కాలేజీ పిల్లవంక గర్వంగా చూస్తూ అరవై రూపాయలు సమర్పించుకొని, క్లాత్‌బిట్ బేగ్‌లో సర్దుకుంటుండగా ప్లాట్‌ఫారం మీద నా చిన్ననాటి మిత్రుడు మురళి కనిపించి పలకరించాడు. కాఫీ తాగుదాం రమ్మంటే బేరంతో సహా బండి దిగి వెళ్ళాను.

వాడూ వూళ్ళోనే ఎఫ్. సి. ఐ లో చేస్తున్నాట్ట... ఆ విషయాలు అవీ... ఇవి మాట్లాడే కోలాహలంలో బెల్ ఎప్పుడు కొట్టాడో గమనించలేదు... బండి కదిలింది...

హడావుడిలో దొరికిన కంపార్ట్‌మెంట్ లోకి ఎక్కేసాను. అది ఇందాకటి కంపార్ట్ మెంట్ కాదు... కాని సీటు దొరికింది ఒకమూల...

బండి స్పీడందుకుని దపకుదురు




స్టేషనుదాటే సరికి కబుర్లలో వున్న కంపార్ట్‌మెంట్ ఖంగుమంటున్న ఆగొంతుక్కు వులిక్కిపడినట్లు అటుచూసింది.

"యువర్ అటెన్షన్ ప్లీజ్!..."

"లేడీస్ అండ్ జెంటిల్‌మన్!... భాయియోం... ఔర్ బహనోం...!" అయ్యలారా. అమ్మలారా!"

మరో సారి వేలంపాట!

ఈ సారి వేలంపాట జరుపుతున్నది ఇందాకటి కుర్రాడు కాదు... నాపక్కన కూర్చుని బట్టల నాణ్యత గురించి చెప్పి నాచేత ఓబిట్ కొనిపించిన సూట్‌వాలా! చీరాల హోల్‌సేల్ బట్టల వ్యాపారస్తుడు! నా కళ్ళముందే నాటకం మళ్ళీ ఆరంభమయింది...! పాటలో పాల్గొంటున్న వాళ్ళు... అదిగో ఆమూలవున్న తాత, అదే ఆడమనిషి... వేలంపాట కుర్రవాడిసారి నాలాటి ?మలో అభాగ్యుడి పక్కనచేరి బట్టం విశిష్టతను గురించి బ్రెయిన్ వాష్ చేస్తున్నాడు...! వీళ్ళంతా ఒక ముఠా... అని పూర్తిగా అర్థమయినా 'పోనితే... ఏదో ఒక షర్ట్‌బిట్ వచ్చింది' అనుకోవటానికికూడా లేకుండాపోయింది.

ఇంటికెళ్ళి ట్రైలర్‌కిస్తే నావంక ఎగాదిగా చూసి "ఈ క్లాత్ ఎక్కడ దొరికిందండీ సార్! తడిపితే సగం కుంచించుకుపోతుంది... రంగెలాగూపోతుంది... ముడతలు పడతాయ్..." అనేశాడు!